క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కమాన్‌పూర్: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై గుండారం గ్రామ శివారులో రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. రహదారి విస్తరణ చేపట్టిన నేపథ్యంలో రహదారి వెడల్పు పెరిగింది. పాత రహదారి ఉన్నప్పుడు రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో రహదారికి ఆనుకొని ఉన్నాయి. ఈ నెల 22 నుంచి జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్లే వాహనాలకు స్తంభాలు కన్పించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల అభివృద్ధి



మాట్లాడుతున్న అలీ

సుల్తానాబాద్: ముస్లిం మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధి కోసం రూ.200కోట్లు కేటాయించి అందులో పావలా వంతు ఖర్చు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులోనే రూ.269 కోట్లు కేటాయించిందని, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్పీ రాజయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

నియామకం



రామస్వామి

పాలకుర్తి: ఆల్ ఇండియా ఓబీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన మల్క రామస్వామి నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని కర్పూరి ఠాకూర్ ప్రాంగణంలో ఆల్ ఇండియా ఓబీసీ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో బీసీ బడి పొలిటికల్ వర్క్‌షాపు నిర్వహించారు. దీనిలో భాగంగా మల్క రామస్వామిని ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చామకూర రాజు ప్రకటించి సంబంధిత నియామక పత్రాన్ని ప్రముఖ బీసీ ఉద్యమ రచయిత సింగిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా రామస్వామికి అందజేశారు.


ఆత్మరక్షణకు కరాటే అవసరం



బెల్ట్‌లు, సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

మంథని: ఆత్మరక్షణతో పాటు సమాజ రక్షణకు కరాటే అవసరమని కాయ్ స్పోర్ట్స్ కమిషన్ చైర్మన్ పాలకుర్తి పాపయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో జపాన్ షిటోరియా కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొనగా అర్హత సాధించిన విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్స్ అందజేశారు. కరాటే శిక్షకులు కావేటి సమ్మయ్య, జపాన్ షిటోరియా కరాటే అకాడమీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి సమ్మయ్య, ఇన్‌స్పెక్టర్ నాగెల్లి రాకేశ్, కావేటి శివ, గణేశ్, తేజ, శ్రీరామ్ ఉన్నారు.

ఆటో యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవం



గుంటి సదయ్య

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఆటో యూనియన్ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా గుంటి సదయ్య, ఉపాధ్యక్షుడిగా సిలివేరి రాజేశం, కోశాధికారిగా నెరువట్ల మహేందర్, ప్రధాన కార్యదర్శిగా కూసి మహేశ్, ముఖ్య సలహాదారుగా ఎండీ అజీజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న సభ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వారసంతకు పార్కింగ్ స్థలమేది?



దారిలో కూరగాయల విక్రయాలు



సర్వీసు రోడ్డుపైన వాహనాల పార్కింగ్

- సర్వీసు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్న వైనం
- దుకాణ స్థలాలు కేటాయించినా.. దారిలోనే విక్రయాలు
- మూత్రశాలలు ఏర్పాటు చేయాలని వినతి

జ్యోతినగర్: వారసంతకు అన్ని సౌకర్యాలు ఉన్నా వాహనాల పార్కింగ్ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో ఎన్టీపీసీ సంస్థ సీఎస్సార్ నిధులతో నిర్మించిన వారసంతలో వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉంచడంతో కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మూత్రశాలలు లేక ఇబ్బంది..

ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో సండే మార్కెట్‌లో కూరగాయాలు విక్రయించేందుకు ఎన్టీపీసీ సంస్థ సీఎస్సార్ ద్వారా అత్యంత ఖరీదైన షెడ్లను నిర్మించింది. కూరగాయల విక్రేతలకు, మాంసం, చికెన్, చేపల విక్రయదారులు, బట్టల వ్యాపారులకు వేర్వేరుగా షెడ్లు నిర్మించింది. నీటి కోసం నల్లాలను సైతం బిగించారు. కానీ మల విసర్జన, మూత్ర విసర్జన చేసేందుకు ఒక మరుగుదొడ్డి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీపీసీ సంస్థ వారు సౌకర్యాలు కల్పించినప్పటికీ మరుగుదొడ్డి నిర్మించకపోవడం, వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. యాజమాన్యం ప్రజల, విక్రయదారుల సౌకర్యం కోసం మూత్రశాలలు, పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

దారిలో విక్రయాలు..

మార్కెట్‌లో కూరగాయాల విక్రేతలకు స్థలాల కేటాయింపు, గద్దెలను నిర్మించినప్పటికీ చాలా మంది నడిచే దారిలో కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్ ఇరుకుగా మారి కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. కేటాయించిన స్థలాల్లో విక్రయాలు చేయాలని, సంబంధిత విభాగానికి చెందిన సిబ్బంది ఆదేశాలు చేయకపోవడం, మార్కెట్‌లో మున్సిపల్‌శాఖ అధికారులు నిర్వహణ మరిచిపోవడంతో ఇష్టానుసారంగా మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు సాగుతున్నాయి.

దారిలో విక్రయాలు నిలిపివేయాలి



సండే మార్కెట్‌లో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. షెడ్లను ఎన్టీపీసీ వారు నిర్మించారు. గద్దెలపైన విక్రయాలు చేయడం లేదు. దారిలో కూర్చుని విక్రయాలు చేయడంతో మార్కెట్ చేయడానికి ఇబ్బందిగా ఉంది. కేటాయించిన స్థలంలో విక్రయాలు చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి. మార్కెట్‌లో మహిళలకు మూత్రశాలలు నిర్మించాలి. – పాపయ్యగౌడ్, నర్రాశాలపల్లె

పార్కింగ్ ఏర్పాటు చేయాలి



సండే మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారుల వాహనాల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి. సర్వీసు రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. పార్కింగ్ కోసం ఎన్టీపీసీ సంస్థ స్థలాన్ని కేటాయించాలి. ఎన్టీపీసీ సంస్థ మార్కెట్‌లో రాత్రి సమయంలో కూరగాయలు విక్రయించే వారికి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సౌకర్యం కల్పించాలి. – రాజయ్య, సింగరేణి సంస్థ మాజీ ఉద్యోగి

యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని ఐతరాజుపల్లిలో గ్రామ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తుల భాగస్వామ్యంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ పోటీలను రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే పాల్గొని ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్, నాయకులు వెంకన్న, దామోదర్ తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కుల రక్షణకు సమ్మె



మాట్లాడుతున్న ముత్యంరావు

సుల్తానాబాద్: కార్మికుల హక్కుల రక్షణ కోసం దేశవ్యాప్తంగా సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో మండల రైస్‌మిల్ ఆపరేటర్స్ యూనియన్ ఆరో వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 14లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, 23 డిమాండ్లతో 16న జరుగుతున్న సమ్మెలో అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జెండాను అధ్యక్షుడు తాండ్ర అంజయ్య ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా తాండ్ర అంజయ్య, కార్యదర్శిగా బ్రహ్మచారి, ఉపాధ్యక్షులుగా, బండారి తిరుపతి, రవీందర్, విలాస్, బండారి రమేశ్, సదయ్య, కోశాధికారిగా, పూసాల సంపత్, కార్యవర్గ సభ్యులు పోగుల లక్ష్మయ్య, మహేందర్, రావుల వెంకటేశ్, వీరగోని కిరణ్, భూసారపు ఓదెలు, బండారి స్వామి, శంకర్, అబ్బాస్, దండి సంపత్, కల్లెపల్లి ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. గుమస్తాల సంఘం మండల అధ్యక్షుడు మాతంగి రాజమల్లు, గ్రామపంచాయతీ మండల కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

శరణ్యకు జాతీయ వైద్యరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న శరణ్య

రామగిరి: వైద్యరంగంలో విశిష్ట సేవలందించేందుకు గాను ప్రకృతి వైద్య నిపుణురాలు డా.శరణ్య ఆదివారం జాతీయ వైద్యరత్న అవార్డు అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ 7వ సౌత్ ఇండియన్ కాన్ఫరెన్స్ 2024 కార్యక్రమంలో భాగంగా వైద్యరంగంలో విశిష్ట సేవలందించినందుకు గాను తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని, అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా ఆరు రాష్ట్రాల అధ్యక్షుడు, రాష్ట్ర కోఆర్డినేటర్ బాదే వెంకటేశం పాల్గొన్నారు.



విజ్ఞానయాత్రలో విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: విజ్ఞాన యాత్రలో భాగంగా ఆదివారం కాల్వశ్రీరాంపూర్ ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజ్ఞానయాత్రకు వెళ్లారు. ఆదివారం ముత్తారం మండలం ధర్మాబాద్‌లోని పురాతన ఆలయాలు, కట్టడాలను సందర్శించారు. ఆలయ నిర్మాణాలు, కట్టడాల నమూనా, నిర్మాణాల్లో శిల్పుల నైపుణ్యం, చారిత్రక నేపథ్యం, ఆనాటి రాజుల పాలన, నదీ పరివాహక ప్రాంతాల్లో గ్రామాల నిర్మాణం విషయాల గురించి, భారతీయుల కళానైపుణ్యం, ఆధ్యాత్మిక భావన, దైవభక్తి, సమాజహితంతో కూడినవని ఉపాధ్యాయులు వివరించారు. హెచ్ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సమత, భారతి, సిబ్బంది విజయ, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

నరేశ్‌కు పురోహితరత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న నరేశ్

ధర్మారం: మండలంలోని రామయ్యపల్లి గ్రామ అభయాంజనేయ స్వామి ఆలయం పురోహితులు మామిడిపెల్లి నరేశ్ ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డు అసోసియేట్ విత్ తెలుగు సాంస్కృతిక సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును వ్యవస్థాపక చైర్మన్ గౌరీ శంకర్ చేతుల మీదుగా అందజేశారు.

అంబేడ్కర్ భవనాన్ని నిర్మించండి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో అంబేడ్కర్ భవనాన్ని వెంటనే నిర్మించేలా చర్యలు చేపట్టాలని నాయకులు తాండ్ర సదానందం, ఆరెల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణ విషయంలో అధికారులు అలసత్వం చేయడం తగదన్నారు. అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

మంథని: మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన బొమ్మర స్వామి, అక్కమ్మ దంపతుల కుమార్తె జ్యోత్స్న వివాహం సందర్భంగా ఆదివారం మంత్రపురి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వివాహ సామగ్రి, ఆర్థికసాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు సన్నేగారి రాము, గీట్ల భరత్‌రెడ్డి, కొమురోజు మధు, మంథని లింగయ్య, దాసరి మొగిళి, ముత్తినేని స్వామి, అల్లం తిరుపతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన హనమంతు సుబ్బారావు మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి ఆదివారం సింగరేణి కార్మికుడు రూ.5వేలు అందజేశారు.

ఆలయ అభివృద్ధి దాతకు సన్మానం



సన్మానిస్తున్న గ్రామస్తులు

రామగిరి: కల్వచర్ల పోచమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన యాట సరోజన గట్టయ్య దంపతులను ఆదివారం మాజీ సర్పంచ్ గంట పద్మ వెంకటరమణారెడ్డి ఘనంగా సన్మానించారు. పోచమ్మ ఆలయంలో గ్రానైట్ నిర్మాణం కోసం సుమారు రూ.4లక్షలు విరాళంగా అందజేశారు. 20ఏళ్లుగా ఉద్యోగరీత్యా సౌదీ అరేబియాలో ఉంటున్న గట్టయ్య సొంత ఊరుపై మమకారంతో విరాళం అందజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆలయంలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, మంథని రవీందర్, యాట భూమేశ్, ముల్కల శారద పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



ర్యాలీలో ఐఎఫ్‌టీయూ నాయకులు

జ్యోతినగర్: ఉద్యమాలతోనే కార్మికుల హక్కులు సాధించుకోచ్చని కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ రైతు, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. దేశంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడాన్ని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఐ.కృష్ణ, ఈదునూరి నరేశ్, అశోక్, బుచ్చయ్య, చంద్రయ్య, మల్లేశ్, లింగమూర్తి, రాయమల్లు, దుర్గయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

అన్నివర్గాల వారు పాల్గొనాలి

గోదావరిఖని: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక ప్రధాన చౌరాస్తా సమీపంలో జరిగే సమ్మెలో అన్ని వర్గాల వారు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఐ.కృష్ణ, ఇ.నరేశ్, బి.అశోక్, చిలుక శంకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌పరం అవుతున్న ప్రభుత్వరంగ సంస్థలు



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కేంద్రంలోని బీజేపీ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం అయ్యాయని సీఐటీయూ అఖిల భారత నేత సాయిబాబు ఆరోపించారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు 16న జరిగే సమ్మెలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్మికులకు అనుకూలమైన లేబర్ కోడ్‌లను మార్చి పెట్టుబడుదారులకు, యాజమాన్యాలకు బానిసలుగా ఉండే విధంగా చట్టాలను రూపొందించిందారని ఆయన విమర్శించారు. సమావేశంలో నాయకులు వంగూరి రాములు, తుమ్మల రాజారెడ్డి, బి.మధుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మాజీ కార్మికుడి నేత్రదానం



తండ్రి నేత్రాలను టెక్నీషియన్‌కు అందజేస్తున్న కుమారుడు మల్లేశ్

కోల్‌సిటీ: గోదావరిఖని హనుమాన్ నగర్‌కు చెందిన కొయ్యల ఎల్లయ్య(85) అనే సింగరేణి మాజీ కార్మికుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సింగరేణి సంస్థలో కోల్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న ఆయన కుమారుడు మల్లేశ్, తండ్రిని కోల్పోయిన దుఃఖంలో కూడా మరో ఇద్దరికి చూపును కల్పించడానికి తండ్రి నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చాడు. స్ఫూర్తిదాయకమైన నేత్రదానానికి కుటుంబ సభ్యులను మల్లేశ్ ఒప్పించాడు. దీంతో సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి కే.ఎస్.వాసు, స్థానిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎల్లయ్య నేత్రాలను, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం అందజేశారు. తండ్రి నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రావణ్‌కుమార్, కార్యదర్శి లింగమూర్తి, గోదావరిఖని సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శి అన్నపూర్ణ, బొల్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, ప్రతినిధులు నూక రమేశ్, రాములు, కవిత, శశికళ, శారద, జ్యోతి, భీష్మాచారి, కమాన్‌పూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి సానా రామకృష్ణారెడ్డి, శంకర్ అభినందించారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కుక్కలగూడూర్



ట్రోఫీ అందజేస్తున్న అంగోతు రవినాయక్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. విన్నర్ కుక్కలగూడూర్ జట్టు, ద్వితీయ స్థానంలో పాలకుర్తి జట్టు నిలిచాయని ట్రస్టు చైర్మన్ అంగోతు రవినాయక్ తెలిపారు. విన్నర్‌కు రూ.20వేలు, రన్నర్‌కు రూ.10వేలు అందజేశారు. ట్రస్టు సభ్యులు కోల ప్రణీత్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, సాయి, వినోద్, సతీశ్, సంజీవ్ తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణ యూత్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



చిగురు సూర్యం



గోనె రాము

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని గోకుల్‌నగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ యూత్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొయ్యడస్వామి యాదవ్, అధ్యక్షుడిగా చిగురు సూర్యం యాదవ్, ఉపాధ్యక్షుడిగా గోనె రాము యాదవ్, ప్రధాన కార్యదర్శిగా శీలం అనిల్‌కుమార్ యాదవ్, సంయుక్త కార్యదర్శిగా కురుమల శ్రీనివాస్‌యాదవ్, కోశాధికారిగా ఊరడి రాము యాదవ్, ముఖ్య సలహాదారులుగా గడ్డి హరీశ్‌యాదవ్, ప్రచార కార్యదర్శిగా జంగిలి ఓంకార్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు యాదవ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయం చుట్టూ దీపాలు వెలిగించి మంగళహారతులు పాడారు. వాసవిమాత స్తోత్రాలు, వాసవి అష్టోత్తర శతనామావళి, వాసవి శతకం, భజనలు కీర్తనలు చేశారు. అమ్మవారికి 21రకాల నైవేద్యాలు సర్పించారు. ఆలయ అర్చకులు నిట్టూరి అంబరీష్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.